సాక్షి అన్నమయ్య జిల్లా

బుధవారం ׀ 15 ׀ ఫిబ్రవరి ׀ 2023



హోరాహోరీగా ఎస్పీఎల్

'సాక్షి' మీడియా గ్రూపు ఆధ్వర్యంలో 'సాక్షి ప్రీమియర్ లీగ్' (ఎస్పీఎల్) రీజనల్ స్థాయి క్రికెట్ పోటీలు తొలి రోజు హోరాహోరీగా సాగాయి. -8లో..



నమో వీరభద్రాయ..

దక్షిణ కాశీగా వెలుగొందుతున్న ప్రముఖ పుణ్యక్షేత్రం రాయచోటిలోని వీరభద్రాలయం బ్రహ్మోత్సవాలు ఈ నెల 15వ తేదీ నుంచి ఘనంగా నిర్వహించనున్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.190	రూ.280
రెండోరకం	రూ.100	రూ.186



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 154 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	670	717
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 819.34 కిలోలు

నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జిల్లా పర్యటన

- జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లెలో జేఎస్‌డబ్ల్యు స్టీల్ ప్లాంటుకు భూమి పూజ
- పులివెందులలో వివాహ రిసెప్షన్‌కు హాజరు కానున్న సీఎం



కడప సిటీ: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఒకరోజు వైఎస్సార్ జిల్లా పర్యటనకు బుధవారం రానున్నారు. ఈ నేపథ్యంలో ఆయన జమ్మలమడుగు, పులివెందుల నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ విజయరామరాజు ముఖ్యమంత్రి పర్యటన వివరాలను మంగళవారం వెల్లడించారు. బుధవారం ఉదయం 9.00 గంటలకు తన నివాసం తాడేపల్లి నుంచి బయలుదేరి కడప ఎయిర్‌పోర్టుకు 10.15 గంటలకు చేరుకుంటారు. అక్కడ రూ. 8800 కోట్లతో 30 లక్షల టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో నిర్మించనున్న జేఎస్‌డబ్ల్యు స్టీల్ ప్లాంటుకు భూమి పూజ చేస్తారు. అనంతరం శిలాఫలకాలను ఆవిష్కరిస్తారు. అక్కడే మౌలిక సదుపాయాలపై సమావేశం నిర్వహిస్తారు. అక్కడి నుంచి 1.20 గంటలకు బయలుదేరి 1.40 గంటలకు పులివెందుల చేరుకుంటారు. పులివెందులలో ఎస్‌సీఎస్‌ఆర్ ఫంక్షన్ హాలులో బలరామిరెడ్డి కుమారుని వివాహ రిసెప్షన్ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదిస్తారు. ఆ తర్వాత 2.40 గంటలకు పులివెందుల నుంచి బయలుదేరి కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుని ప్రత్యేక విమానంలో 4.30 గంటలకు తాడేపల్లిలోని తన నివాసానికి చేరుకుంటారు.

- జేఎస్‌డబ్ల్యు గ్రూపు సారథ్యంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు
- రూ.8800 కోట్లతో నిర్మాణానికి సన్నాహాలు
- తొలివిడతలో రూ.3300 కోట్లతో నిర్మాణ పనులు
- రూ.700 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- సీమ నిరుద్యోగ సమస్యకు ఫుల్‌స్టాప్
- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా నేడు భూమి పూజ

2019లో స్టీల్ ప్లాంట్ శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం వైఎస్ జగమోహన్‌రెడ్డి, తదితరులు (ఫైల్)




కడప సిగలో కలికితురాయి

సాక్షి ప్రతినిధి, కడప: రాయలసీమ ప్రజల చిరకాల స్వప్నం నెరవేరే రోజు ఆసన్నమైంది. కడప సిగలో మరో కలికితురాయి వచ్చి చేరుతోంది. తన రాజకీయ భవిష్యత్తుకు అండగా నిలిచిన ప్రాంతం శాశ్వత అభివృద్ధి చెందాలనే సంకల్పం మొగ్గ తొడుగుతోంది. నిరుద్యోగాన్ని పారదోలి మెరుగైన జీవనోపాధి కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. జేఎస్‌డబ్ల్యు స్టీల్స్ లిమిటెడ్ సంస్థ ద్వారా స్టీల్ ప్లాంట్ నిర్మించనున్నారు. తొలివిడతగా రూ.3,300 కోట్లతో 10 లక్షల టన్నుల సామర్థ్యంతో చేపట్టనున్న నిర్మాణ పనులకు గురువారం సున్నపురాళ్లపల్లి గ్రామం వద్ద భూమి పూజ చేయనున్నారు.

కడప గడపలో స్టీల్ ప్లాంట్ నిర్మించాలని విభజన చట్టంలో పొందుపర్చారు. తద్వారా నిరుద్యోగులకు ప్రత్యక్షంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని సంకల్పించారు. అలాగే అనుబంధ పరిశ్రమల ద్వారా వేలాది మందికి జీవనోపాధి లభిస్తుందని భావించారు. గత టీడీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించింది. అయితే ఎన్నికలకు ముందు 2018లో ఓ పునాది రాయితో చంద్రబాబు సర్కార్ సరిపెట్టింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్టీల్ ప్లాంట్ నిర్మించాలనే ఆశయాన్ని భుజానికెత్తుకుంది. సీఎంగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 డిసెంబర్ 23న స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు. ఏపీ హైగ్రేడ్ స్టీల్స్ లిమిటెడ్ పేరిట నిర్వహణకు సన్నాహాలు చేపట్టారు. కాగా 2020 ఫిబ్రవరి నుంచి కరోనా వైరస్ వ్యాప్తితో ప్రపంచమే అతలాకుతలమైంది. ప్రజలు బతుకు జీవుడా అంటూ తలదాచుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. రెండేళ్ల పాటు ఇలాంటి పరిస్థితి కొనసాగడం వల్ల తక్షణ నిర్మాణానికి ప్రతిబంధకంగా మారిందని నిపుణులు వివరిస్తున్నారు.

▶▶ జేఎస్‌డబ్ల్యు స్టీల్స్ లిమిటెడ్‌చే భూమి పూజ..

చెప్పిన మాట ప్రకారం జేఎస్‌డబ్ల్యు స్టీల్స్ లిమిటెడ్ ద్వారా స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి భూమి పూజ చేయనున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ డిసెంబర్‌లో జిల్లా పర్యటన సందర్భంగా జేఎస్‌డబ్ల్యు స్టీల్స్ లిమిటెడ్ ద్వారా జమ్మలమడుగులో స్టీల్ ప్లాంట్ నిర్మించనున్నట్లు ప్రకటించారు. ఆ మేరకు జీఓ ఎంఎస్ నంబర్ 751 ద్వారా ఎకరం రూ.1.65 లక్షలతో 3,148.68 ఎకరాలు కేటాయిస్తూ 2022 డిసెంబర్ 16న ఉత్తర్వులు జారీ చేశారు. తొలివిడతలో ఏడాదికి 1 మిలియన్ టన్నులు (10లక్షల టన్నులు) ఉత్పత్తి సామర్థ్యంతో స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి జేఎస్‌డబ్ల్యు సిద్ధమైంది. అందుకోసం ఫేజ్-1లో రూ.3,300 కోట్లు వెచ్చించి, 36 నెలల కాలపరిమితిలో ఫేజ్-1 పనులు పూర్తి కానున్నాయి. తొలివిడత ప్లాంట్‌లో వైర్ రాడ్స్, బార్ మిల్స్ ఉత్పత్తి చేయనున్నారు. మరో రూ.5,500 కోట్లతో ఫేజ్-2 నిర్మాణ పనులు పూర్తి కానున్నాయి. ఫేజ్-2 సైతం మార్చి 31, 2029 నాటికి పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.



▶▶ మౌలిక వసతులు కల్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి కావాల్సిన మౌలిక వసతుల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.720 కోట్లు వెచ్చిస్తోంది. నాలుగులేన్ల రహదారి, రైల్వే కనెక్టివిటీ, నీటి వసతి కోసం పైపు లైన్ ఏర్పాటు, నిల్వ చేసుకునేందుకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు, విద్యుత్ సరఫరా, కాంపౌండ్ వాల్, భవన సముదాయం నిర్మించనున్నారు. అందులోభాగంగా ఎన్‌హెచ్-67 నుంచి ముద్దనూరు టు జమ్మలమడుగు రోడ్డుకు అనుసంధానంగా రూ.145.3 కోట్ల తో 12 కిలోమీటర్లు నాలుగు లేన్ల రహదారి నిర్మించనున్నారు. అలాగే ఎర్రగుంట్ల టు ప్రొద్దుటూరు రైల్వే లైన్ నుంచి రూ.323.5 కోట్లతో 9.4 కిలోమీటర్లు రైల్వేలైన్ నిర్మాణం చేపట్టనున్నారు. మైలవరం జలాశయం నుంచి 2 టీఎంసీల నీరు సరఫరా చేయనున్నారు. అందుకోసం 15 కిలోమీటర్లు పైపులైన్ నిర్మించనున్నారు. ఇప్పటికే విద్యుత్ సరఫరాకు కావాల్సిన చర్యలు పూర్తి అయ్యాయి. రూ.76.42 కోట్లతో 27 కిలోమీటర్ల మేరకు విద్యుత్ లైన్ ఏర్పాటు, 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తయింది. 20 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన సంప్ నిర్మాణం పూర్తయింది. ప్రహరీ, భవన సముదాయం వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. అంతర్గత రోడ్డు పనులు పూర్తి అయ్యాయి. గురువారం జేఎస్‌డబ్ల్యు స్టీల్స్ లిమిటెడ్ ప్రతినిధులతో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి భూమి పూజ చేయనున్నారు.

మాటకు కట్టుబడి స్టీల్‌ప్లాంట్‌కు భూమిపూజ

- ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి



సభా వేదిక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

జమ్మలమడుగు: ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన ఆరునెలల్లోనే స్టీల్ ప్లాంట్‌కు భూమిని కేటాయించడంతోపాటు భూమి పూజ చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో కన్యతీర్థం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 డిసెంబర్‌లో స్టీల్‌ప్లాంట్‌కు శిలాఫలకం వేసిన తర్వాత కరోనా ప్రభావం చేత రెండు సంవత్సరాల పాటు పనులు నిలిచిపోయాయన్నారు. తిరిగి కరోనా నుంచి కోలుకుంటున్న సమయంలో మంచి కంపెనీతో పనులు ప్రారంభించాలనే సంకల్పంతో సీఎం వైఎస్ జగన్ వేచి చూశారన్నారు. అందులో భాగంగా మొదటి విడతగా రూ.3300 కోట్లతో జిందాల్ కంపెనీ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు ముందుకు వచ్చిందన్నారు. వీరైనంత త్వరగా పనులు ప్రారంభించే విధంగా జిందాల్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుని బుధవారం ముఖ్యమంత్రి భూమి పూజ చేయనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ సలహామండలి చైర్మన్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి, పారిశ్రామికాభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మార్పల్ శ్రీను, హృషికేశవరెడ్డి, ముద్దనూరు మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంట్ వేదికను పరిశీలించిన కలెక్టర్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్టీల్ ప్లాంట్ పనులకు భూమి పూజ చేయనున్న ప్రదేశంలోని వేదికను కలెక్టర్ విజయరామరాజు, జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ జి.శ్రీనివాసులు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్


గంగమ్మ జాతరకు పటిష్ట ఏర్పాట్లు



మండలస్థాయి అధికారులకు సూచనలు ఇస్తున్న ఆర్డీఓ రంగస్వామి

లక్కిరెడ్డిపల్లి: ఈనెల 21, 22 తేదీలలో జరగనున్న గంగమ్మ జాతర సందర్భంగా భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆర్డీఓ రంగస్వామి పేర్కొన్నారు. జాతరలో ఏవైనా లోపాలు జరిగి భక్తులు ఇబ్బందులకు గురైతే ఆ శాఖ అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మంగళవారం ఆయన వివిధ శాఖల, మండలస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. చాందినీ బండ్లు పురవీధుల గుండా ఊరేగేటప్పుడు విద్యుత్ తీగలు తగలకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. భక్తులకు తాగునీరు సమస్య తలెత్తకుండా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు సూచించారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా గట్టిబందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సామల నరసింహారెడ్డి, సర్పంచ్ వెంకటనారాయణ రెడ్డి, ప్రత్యేక అధికారి రవీంద్రరాజు, ఆలయ కమిటీ సిబ్బంది, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతు పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం



కడప అగ్రికల్చర్ : రైతు పురస్కారాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు. ఆచార్య యన్.జి. రంగా వ్యవ సాయ విశ్వ విద్యాలయం ఆంధ్రప్రదేశ్‌లోని అభ్యుదయ రైతులకు గుర్తింపు ఇవ్వడం కోసం 2019 సంవత్సరం నుంచి ప్రతి ఏటా ఉగాది పర్వదినాన రాష్ట్ర స్థాయి పురస్కారాలు అందజేస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రం, రూ. 5 వేలు నగదు అందజేస్తారన్నారు. 2022-23 సంవత్సరానికిగాను ఆసక్తి గల రైతు సోదర, సోదరీమణులు ఈ నెల 17వ తేదీలోపు తమ దగ్గరలో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రం, ఏరువాక కేంద్రం, వ్యవసాయ పరిశోధన స్థానంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

పర్యాటకుల భద్రతకు పెద్దపీట

- వర్చువల్ పద్ధతిలో హార్సిలీహిల్స్ టూరిస్ట్ పోలీసు స్టేషన్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- శిలాఫలకం ఆవిష్కరించిన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

బి.కొత్తకోట: అన్నమయ్య జిల్లాలో ఏకైక పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌కు వచ్చే సందర్శకుల భద్రతకు పెద్దపీట వేస్తామని ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 పర్యాటక పోలీసు స్టేషన్లను మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ పద్ధతిలో సీఎం ప్రారంభించారు. అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలం హార్సిలీహిల్స్ పోలీసు స్టేషన్‌ను సీఎం ప్రారంభించగానే జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇక్కడ విధులు నిర్వహించే సిబ్బంది పర్యాటకుల ఇబ్బందులు తెలుసుకుని సహకరిస్తారని చెప్పారు. అనంతరం ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ శివాంజనేయులు, ఎస్‌ఐలు రామమోహన్, సుకుమార్, రవీంద్రలతో కలిసి టూరిస్ట్ పోలీసు కేంద్రం ఆవరణంలో మొక్క నాటి నీరుపోశారు.

22 ఏళ్ల తర్వాత మళ్లీ..

హార్సిలీహిల్స్‌పై బ్రిటిష్ హయాం నుంచి పోలీస్‌స్టేషన్ ఉంది. దీనికోసం స్టేషన్ భవనం నిర్మించి, విధులు నిర్వహించే సిబ్బందికి ఇళ్లను నిర్మించారు. అప్పటినుంచి 2000 ఏడాది వరకు హార్సిలీహిల్స్‌పై ఒక హెడ్‌కానిస్టేబుల్, నలుగురు కానిస్టేబుళ్లు విధుల్లో ఉండేవారు. అప్పటి వరకు కొండను గవర్నర్లు, సీఎంలు సందర్శించారు. ఆ తర్వాత గవర్నర్లు విడిది చేయలేదు. సీఎంలు సందర్శించలేదు. దీనితో ఈ స్టేషన్‌లో విధులు నిర్వహించే సిబ్బందిని తొలగించి, మొబైల్ పోలీసులను నియమించారు. తాజాగా ప్రభుత్వం టూరిస్ట్ పోలీసు విధానం తేవడంతో కొండపై మళ్లీ పాతరోజులు వచ్చాయి. ఆరుగురు సిబ్బంది కొండపై విధుల్లో ఉంటారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం కొండకు వస్తున్న పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగింది. శని, ఆదివారాల్లో రెండువేల మంది వరకు, సాధారణ రోజుల్లో 200-300 మంది సందర్శకులు వస్తుంటారు. వేసవి సెలవులు, నూతన ఏడాది, పండగలు కలుపుకుని సగటున ఏడాదికి రెండులక్షల మంది పర్యాటకులు కొండను సందర్శిస్తున్నారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

జిల్లా ప్రగతికి తోడ్పాటు ఇవ్వండి

- జగనన్న కాలనీల్లో నీటి సౌకర్యం
- బిల్లుల చెల్లింపులో జాప్యం కూడదు
- పీహెచ్‌సీల్లో రాత్రివేళ వైద్యులు ఉండాలి
- ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరగాలి
- జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా ప్రగతికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి ప్రజాప్రతినిధులు, అధికారులు తోడ్పాటు నందించాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి అన్నారు. మంగళవారం జెడ్పీలోని తన చాంబర్‌లో నిర్వహించిన గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్య, ప్రణాళిక, ఆర్థిక, పనుల స్థాయి సంఘాల సమావేశాలకు ఆయన అధ్యక్షత వహించారు. పలు అంశాలపై సభ్యులు లేవనెత్తిన సమస్యలకు సంబంధిత అధికారులు జవాబు ఇచ్చారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున కొత్తగా చేపట్టాల్సిన పనులను ప్రకటించడం లేదన్నారు. జగనన్న కాలనీల్లో తాము ఇల్లు నిర్మించుకున్నప్పటికీ బిల్లుల చెల్లింపులో అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారన్న విమర్శలు లబ్ధిదారుల నుంచి వినిపిస్తున్నాయని తెలిపారు. ఇక మీదటనైనా బిల్లులు సకాలంలో చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇళ్ల నిర్మాణం వేగంగా, సకాలంలో పూర్తయ్యేందుకు వీలుగా నీటి సౌకర్యం కల్పించాలన్నారు. పైపులైన్లు వెంటనే ఏర్పాటు చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. ఒక్కో గ్రామ పంచాయతీకి ప్రభుత్వం రూ. 20 లక్షలు చొప్పున ఇస్తోందని, ఇలా వచ్చిన రూ. 24 కోట్లతో 655 పనులు జరుగుతున్నాయన్నారు. సచివాలయాల నిర్మాణంలో రాష్ట్రంలో జిల్లా ప్రథమ స్థానంలో ఉందని పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు రాత్రి పూట కూడా ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చూడాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే డెలివరీలు జరిగే విధంగా చూడాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం కింద గ్రామీణులకు నెలలో రెండుసార్లు వైద్య సేవలు అందించాలన్నారు. రిమ్స్‌లో ప్లేట్ లెట్స్ చికిత్స అందుబాటులో ఉందని కో ఆప్షన్ సభ్యుడు కరీముల్లా అడిగిన ప్రశ్నకు అదనపు డీఎంహెచ్‌ఓ సమాధానమిచ్చారు. పెనగలూరు మండలం ఎన్‌ఆర్ పురం గ్రామానికి ఆర్‌టీసీ నైట్ సర్వీసు సౌకర్యం కల్పించాలని, కొత్తపల్లె గ్రామానికి ఒక బస్సు ఏర్పాటు చేయాలని ఆ మండల జెడ్పీటీసీ సుబ్బరాయుడు కోరారు. తక్షణమే బస్సు సర్వీసులు నడిపేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ గోపాల్‌రెడ్డికి జెడ్పీ చైర్మన్ సూచించారు. ఇంకా పలువురు సభ్యులు వివిధ అంశాలు ప్రస్తావించారు. జెడ్పీ వైస్ చైర్మన్ టి.బాలయ్య అధ్యక్షతన వ్యవసాయ స్థాయి సంఘం, మరో వైస్ చైర్మన్ జె.శారద అధ్యక్షతన మహిళా సంక్షేమ స్థాయి సంఘం, చిట్వేలి జెడ్పీటీసీ సి.పుష్పలత అధ్యక్షతన సాంఘిక సంక్షేమ స్థాయి సంఘ సమావేశాలు జరిగాయి. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ రమణారెడ్డి, ఇతర జెడ్పీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



స్థాయి సంఘ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

నిరంతరం అందుబాటులో పోలీసు సేవలు

- వైఎస్సార్ జిల్లా ఎస్పీ అన్బురాజన్

ఒంటిమిట్ట: పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు ఎదురవ్వకుండా పోలీసులు నిరంతరం అందుబాటులో ఉంటారని వైఎస్సార్ జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పేర్కొన్నారు. మంగళవారం రామాలయం వెనుకవైపు ఏర్పాటుచేసిన టూరిస్టు పోలీసు స్టేషన్‌ను వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం కమ్యూనికేషన్ ఎస్పీ శారదతో కలిసి జిల్లా ఎస్పీ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఒంటిమిట్ట, గండికోట ప్రాంతాల్లో టూరిస్టు పోలీసుస్టేషన్లు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. యాత్రికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పోలీసులు సూచనలు ఇవ్వడంతోపాటు స్టేషన్‌లో నిరంతరం పోలీసు సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటశివారెడ్డి, సీఐ పురుషోత్తంరాజు, ఎస్ఐ మధుసూదనరావు, సిద్ధవటం ఎస్ఐ నాగతులసీకుమార్ పాల్గొన్నారు.



టూరిస్టు పోలీసుస్టేషన్ శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ అన్బురాజన్, కమ్యూనికేషన్ ఎస్పీ శారద

హత్యరాలలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు

రాజంపేట సబ్‌కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

రాజంపేట: ప్రసిద్ధ శైవక్షేత్రమైన హత్యరాల(అత్తిరాల)లో మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని రాజంపేట సబ్‌కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆదేశించారు. మంగళవారం అన్నమయ్య భవన్‌లో హత్యరాల త్రేతేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల నిర్వహణ విషయంలో అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. భక్తుల రాకపోకలకు సంబంధించి రవాణా సౌకర్యాలు మెరుగ్గా ఉండాలన్నారు. మహిళా భక్తుల విషయంలో పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మడుగులో భక్తులు స్నానాలకు వెళ్లే క్రమంలో ఎలాంటి ప్రమాదాలకు గురికాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆలయ చైర్మన్ వెలగచర్ల సుబ్బారెడ్డి, ఈఓ కొండారెడ్డి, తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి, ఎంపీడీఓ బాలస్వామి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సీహెచ్ కృష్ణ, రూరల్ సీఐ పుల్లయ్య, ఎస్ఐ భక్తవత్సలం, ఎంవీఐ వినోద్‌కుమార్, ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా త్రేతేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఆహ్వాన పత్రికలను సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ విడుదల చేశారు.



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ అహ్మద్‌ఖాన్

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

డీసీసీ బ్యాంకు సీఈఓ రాజేంద్రకుమార్

రాయచోటి : జిల్లాలోని రైతులందరూ బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా బ్యాంకు మేనేజర్లు రైతులకు సహకరించాలని డీసీసీ బ్యాంకు సీఈఓ రాజేంద్రకుమార్ బ్యాంకర్లకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో వ్యవసాయ శాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ అధ్యక్షతన జిల్లా స్థాయి టెక్నికల్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీసీసీ బ్యాంకు సీఈఓ మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రబీ, ఖరీఫ్ సీజన్లలో రైతులు సాగు చేసే పంటల వ్యయానికి తగ్గట్టుగా బ్యాంకులు రుణసౌకర్యం కల్పించి సహకరించాలని సూచించారు. రైతులు కూడా తీసుకున్న రుణాలను తిరిగి సకాలంలో చెల్లించాలన్నారు. ఇలా చెల్లించడం వల్ల బ్యాంకర్లు రైతులకు రుణ మంజూరులో అధిక ప్రాధాన్యత ఇస్తారన్నారు. వ్యవసాయ శాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో రైతులు సాగు చేసే వివిధ పంటలకు సంబంధించి పంటలసాగు వ్యయానికి తగ్గట్టుగా బ్యాంకులు రుణసౌకర్యం కల్పించాలన్నారు. రైతులు పండించే అన్ని రకాల పంటలతో పాటు ఆవులు, గొర్రెలకు కూడా రుణాలు ఇస్తామన్నారు. రైతులు నూతన ఆధునిక సాంకేతిక పద్ధతుల ద్వారా వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించేందుకు వ్యవసాయ అధికారుల సహకారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాబార్డు డీడీఎం విజయవిహారి, ఎల్‌డీఎం వెంకటేశ్వరరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు, వివిధ బ్యాంకుల మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీసీ బ్యాంకు సీఈఓ రాజేంద్రకుమార్, వేదికపై వ్యవసాయ శాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ తదితరులు

క్లుప్తంగా

మంచి ఫలితాలు సాధించాలి

సంబేపల్లె : పదవ తరగతి విద్యార్థులు శ్రద్ధగా చదివి మంచి ఫలితాలు సాధించాలని అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి అన్నారు. మండల పరిధిలోని దేవపట్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పదవ తరగతి పరీక్షలలో విద్యార్థులు పట్టుదలతో చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు.

వ్యక్తికి గాయాలు

మదనపల్లె : స్కూటీ ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మంగళవారం పట్టణంలోని చంద్రాకాలనీకి చెందిన గోపాల్(50) రింగ్ రోడ్డు నుంచి చంద్రాకాలనీకి నడిచి వస్తుండగా, ఓ మహిళ స్కూటీలో వేగంగా వస్తూ ఢీకొంది. ప్రమాదంలో బాధితుడు గోపాల్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి బాధితుడిని తరలించారు.

యువకుడిపై కేసు నమోదు

నిమ్మనపల్లె : మైనర్‌బాలికను మాయమాటలతో మోసగించిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఫాతిమా మంగళవారం తెలిపారు. మండలంలోని తవళం గ్రామానికి చెందిన ఓ మైనర్‌బాలిక(15)ను నిమ్మనపల్లె పంచాయతీ గంగాపురంపల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు ప్రశాంత్ ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి ఈనెల 12న తనవెంట తీసుకెళ్లాడు. వారిద్దరూ కొండయ్యగారిపల్లె పంచాయతీ వెంకోజిగారిపల్లె సమీపంలోని గుర్రప్పస్వామి ఆలయం వద్ద ఉండగా బాలిక తల్లిదండ్రులకు సమాచారం అందడంతో వెంటనే వారు అక్కడకు వెళ్లారు. బాలిక తల్లిదండ్రులను గమనించిన నిందితుడు ప్రశాంత్ బాలికను వదలి పారిపోయాడు. జరిగిన ఘటనపై బాలిక తల్లి సరస్వతి ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వివాహిత అదృశ్యం

మదనపల్లె : వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు తాలూకా ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. మండలపరిధిలోని కొత్తపల్లెకు చెందిన శ్రీనివాసులు, మంజుల కుమార్తె హరిప్రియను రామసముద్రం మండలం ఎర్రమశెట్టిపల్లెలో సుమారు 11ఏళ్ల క్రితం రమేష్‌బాబుకు ఇచ్చి వివాహం చేశారు. రమేష్‌బాబు వెల్డింగ్ వర్క్‌షాపు నిర్వహిస్తూ కర్నాటకలోని చింతామణిలో నివసిస్తున్నాడు. భార్యాభర్తల విభేదాల కారణంగా వారంరోజుల క్రితం భర్త రమేష్‌బాబు హరిప్రియను కొత్తపల్లెలో వదలివెళ్లాడు. రెండురోజుల క్రితం పెద్దమనుష్యుల సమక్షంలో పంచాయతీ నిర్వహించారు. ఈ క్రమంలో ఈనెల 11వతేదీ హరిప్రియ ఇంటి నుంచి వెళ్లి కనిపించకుండా పోయింది. తనకుమార్తె కనిపించడం లేదంటూ తండ్రి శ్రీనివాసులు తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

హోరాహోరీగా ఎస్పీఎల్

SAKSHI PREMIER LEAGUE

SAKSHI MEDIA GROUP www.sakshi.com

- రీజినల్ స్థాయిలో తలపడిన అనంత, వైఎస్సార్, తిరుపతి, కర్నూలు, నంద్యాల జట్లు
- సీనియర్ విభాగంలో ఫైనల్స్‌కు చేరిన తిరుపతి, కడప జట్లు



ఫైనల్స్‌కు చేరిన తిరుపతి సీకాం డిగ్రీ కళాశాల జట్టు



ఫైనల్స్‌కు చేరిన ప్రొద్దుటూరు ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాల జట్టు



టాస్ వేసి అనంతపురం, తిరుపతి జట్ల మధ్య మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న 'సాక్షి' అనంతపురం బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్



అనంత బౌలర్ చేతిలో క్లీన్ బౌల్డ్ అయిన తిరుపతి బ్యాటర్



ప్రొద్దుటూరు బ్యాటర్‌ను ఔట్ చేసిన ఆనందంలో కర్నూలు రాయలసీమ వర్సిటీ క్రీడాకారులు

అనంతపురం సప్తగిరి సర్కిల్ : 'సాక్షి' మీడియా గ్రూపు ఆధ్వర్యంలో 'సాక్షి ప్రీమియర్ లీగ్' (ఎస్పీఎల్) రీజినల్ స్థాయి క్రికెట్ పోటీలు తొలి రోజు హోరాహోరీగా సాగాయి. అనంతపురం జిల్లాతో పాటు వైఎస్సార్, తిరుపతి, కర్నూలు, నంద్యాల జట్లు రీజినల్ స్థాయి పోటీలకు అర్హత సాధించగా... అనంత క్రీడాగ్రామం వేదికగా పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. సీనియర్ విభాగంలో సీకాం డిగ్రీ కళాశాల (తిరుపతి), ఆర్ట్స్ కళాశాల (అనంతపురం) జరిగిన తొలి మ్యాచ్‌ను 'సాక్షి' అనంతపురం బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్ టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్తమాన క్రీడాకారులకు ఇలాంటి వేదికలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. క్రీడల్లో ఉజ్వల భవిష్యత్తును ఆకాంక్షించేవారు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందన్నారు. మానసిక, శారీరక వికాసంతో పాటు క్రీడల్లో రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగాలు సులువుగా దక్కించుకోవచ్చునన్నారు. కృషి, పట్టుదల, అంకితభావం, సాధన ఉంటే ఎలాంటి క్రీడలోనైనా రాణించవచ్చునన్నారు. గెలుపోటములను సమానంగా తీసుకున్నప్పుడే క్రీడాకారుడికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో 'సాక్షి' ఏడీవీటీ అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసులు, ఈవెంట్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మ్యాచ్‌ల వివరాలు ఇలా..

- అనంత క్రీడాగ్రామంలోని హాకీ క్రీడామైదానం వేదికగా జరిగిన సీనియర్ విభాగం తొలి మ్యాచ్‌లో సీకాం డిగ్రీ కళాశాల (తిరుపతి), ఆర్ట్స్ కళాశాల అనంతపురం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి ఆర్ట్స్ కళాశాల జట్టు బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన తిరుపతి జట్టు నిర్ణీత పది ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 110 పరుగులు సాధించింది. జట్టులో లేఖజ్ 18 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 37 పరుగులతో అజేయంగా నిలిచాడు. మరో బ్యాటర్ శశాంక్ 14 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సర్లతో 29 పరుగులు సాధించాడు. అనంతపురం బౌలర్లలో వినయ్ 3, భార్గవ్ 2 వికెట్లు దక్కించుకున్నారు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన అనంతపురం జట్టు నిర్ణీత పది ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 84 పరుగులు మాత్రమే చేసింది. జట్టులో భార్గవ్ 14 బంతుల్లో 2 సిక్సర్లతో 22 పరుగులు, వినయ్ 14 బంతుల్లో 1 సిక్సర్, 1 ఫోర్‌తో 19 పరుగులు చేసినా ఉపయోగం లేకుండా పోయింది. తిరుపతి బౌలర్ కార్తీక్ 1 వికెట్ సాధించాడు. 26 పరుగులతో తిరుపతి జట్టు విజయం సాధించింది.
- సీనియర్ విభాగంలో జరిగిన రెండో మ్యాచ్‌లో వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాల, కర్నూలులోని రాయలసీమ యూనివర్సిటీ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ప్రొద్దుటూరు జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 79 పరుగులు చేసింది. జట్టులో వెంకటేష్ 20 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 30 పరుగులు సాధించాడు. కర్నూలు బౌలర్లలో లోకేష్ 3, హరి 2 వికెట్లు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన కర్నూలు జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 75 పరుగులకే పరిమితమైంది. జట్టులో జావీద్ 31 బంతుల్లో 2 సిక్సర్లు, 3 ఫోర్లతో 51 పరుగులతో అజేయంగా నిలిచాడు. కడప బౌలర్లలో సాయి సుధీర్ 1 వికెట్ సాధించారు. 4 పరుగుల తేడాతో ప్రొద్దుటూరు జట్టు విజయం సాధించింది.

నేడు సీనియర్ విభాగంలో ఫైనల్స్

సీనియర్ విభాగంలో ఫైనల్ మ్యాచ్‌ను సీకాం డిగ్రీ కళాశాల (తిరుపతి), ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాల (ప్రొద్దుటూరు - వైఎస్సార్ జిల్లా) మధ్య బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నారు.

జూనియర్ విభాగంలో చెలరేగిన తిరుపతి బ్యాటర్లు

జూనియర్ విభాగంలో అనంతపురం జిల్లా నుంచి ఆత్మకూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల జట్టుతో పాటు వైఎస్సార్ జిల్లా కడపలోని శ్రీసాయి ఐటీఐ కళాశాల, తిరుపతిలోని సీకామ్ జూనియర్ కళాశాల, నంద్యాలలోని ఈఎస్‌సీ పాలిటెక్నిక్ కళాశాల జట్లు రీజనల్ స్థాయి పోటీలకు అర్హత సాధించాయి.

- తొలి మ్యాచ్‌ను సీకాం జూనియర్ కళాశాల (తిరుపతి), ఈఎస్‌సీ పాలిటెక్నిక్ కళాశాల (నంద్యాల)జట్ల మధ్య నిర్వహించారు. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన నంద్యాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 61 పరుగులు చేసింది. జట్టులో అనిల్ 21 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సర్లతో 28 పరుగులు సాధించాడు. తిరుపతి బౌలర్లలో ధనుష్, జబిన్ చెరో వికెట్ కూలదోశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన తిరుపతి జట్టు కేవలం 5.4 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జట్టులో భరత్ 15 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్సర్‌తో 29 పరుగులు సాధించాడు. నంద్యాల బౌలర్లలో గోవర్ధన్ 1 వికెట్ కూలదోశాడు. 8 వికెట్లతో తిరుపతి జట్టు భారీ విజయాన్ని నమోదు చేసి, ఫైనల్స్‌కు చేరుకుంది.
- బుధవారం ఉదయం 9 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల - ఆత్మకూరు (అనంతపురం), శ్రీసాయి ఐటీఐ కళాశాల - కడప (వైఎస్సార్) జట్ల మధ్య నిర్వహించనున్నారు. ఈ మ్యాచ్‌లో గెలుపొందిన జట్టుతో తిరుపతి సీకాం జట్టు తలపడనుంది.

హత్యా యత్నం చేసిన ముగ్గురి అరెస్ట్



నిందితుల వివరాలు వివరిస్తున్న డీఎస్పీ శ్రీధర్

రాయచోటిటౌన్ : పీలేరులో 10 టీవీ విలేకరి పర్వతరెడ్డిని చంపేందుకు ప్రయత్నించిన ముగ్గురిని అరెస్ట్ చేశామని రాయచోటి డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. ఆవుల వ్యాపారులను వేధించడం వల్లనే పర్వతరెడ్డిని హత్య చేసేందుకు ప్రయత్నించామని నిందితులు అంగీకరించారని డీఎస్పీ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పర్వత రెడ్డి చిన్నమండెం మండలం వండాడి గ్రామంలో శ్రీ వరసిద్ధి వినాయక గో సంరక్షణ సేవా ట్రస్టు నిర్వహిస్తున్నారు. కాగా ప్రొద్దుటూరుకు చెందిన షేక్ మహమ్మద్ ఇలియాస్ బీఫ్ వ్యాపారం సాగిస్తున్నారు. అతను జిల్లాలోనే కాకుండా ఇతరా జిల్లాల నుంచి ఆవులు, ఎనుములు కొనుగోలు చేసి ఇతరా రాష్ట్రాలకు ఎగుమతి చేయడంతో పాటు సొంతంగా బీఫ్ మాంసాన్ని విక్రయిస్తాడు. మహమ్మద్ చేస్తున్న అక్రమ రవాణాను అటకాయించడం లేదా తనకు అదనంగా డబ్బులు ఇవ్వాలని పర్వతరెడ్డి బెదిరించడం వంటి కార్యక్రమాలకు పాల్పడేవాడు. బెదిరించి డబ్బులు అడుగుతున్నాడనే కోపంతో పర్వతరెడ్డిపై మహమ్మద్ కక్ష పెంచుకొని ఎలాగైనా చంపాలని నిర్ణయించుకున్నాడు. దీంతో తన షాపులో పని చేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన మహమ్మద్ ఇంతియాజ్, షేక్ సుహేల్ లకు సుఫారీ ఇచ్చి పర్వత రెడ్డిని ఎలాగైనా అడ్డుతొలిగించాలని కోరాడు. దీంతో ఆయన నుంచి సుఫారీ తీసుకొన్న వారు రాయచోటి చెక్ పోస్టు వద్ద పర్వతరెడ్డిపై నిఘా పెట్టారు. గతనెల 30వ తేదీ రెక్కీ కూడా నిర్వహించారు. గత నెల 31వ తేదీ సాయంత్రం చిత్తూరు రింగ్ రోడ్డు సమీపాన టీ తాగి ఇంటికి వచ్చే సమయంలో స్కూటర్ వెనకాలే వస్తూ చెక్ పోస్టు వద్ద పిస్టల్‌తో కాల్పులు జరిపారు. ఈ కాల్పులలో గాయపడ్డ పర్వతరెడ్డి రాయచోటి ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి ప్రాథమిక చికిత్స చేయించుకొన్నాడు. అక్కడి డాక్టర్లు కడపకు రెఫర్ చేశారు. కడపలో డాక్టర్లు పరీక్షలు నిర్వహించి శరీరం లోపల బుల్లెట్ ఉందని నిర్ధారించి బెంగుళూరుకు వెళ్లాలని సూచించారు. జరిగిన సంఘటనపై పర్వతరెడ్డి భార్య ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా ప్రొద్దుటూరులోని బీఫ్ షాపులో పనికి కుదిరిన ఇద్దరి నిందితులను పట్టుకొని వారిపై కేసులు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పెడుతున్నట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన అర్బన్ సీఐ సుధాకరరెడ్డి, ఎస్‌ఐ నరసింహారెడ్డి, వీరబల్లె ఎస్‌ఐ రహీముల్లాను జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు అభినందించారని డీఎస్పీ చెప్పారు.

బైజూస్ ట్యాబ్‌లు సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా విద్యాశాఖ అధికారి వై. రాఘవరెడ్డి



కేజీబీవీలో సౌకర్యాలపై ఆరా తీస్తున్న డీఈఓ

కేవీపల్లె : విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందజేసిన బైజూస్ ట్యాబ్‌లు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి వై. రాఘవరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చిన్నకమ్మపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే వగళ్ల కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయంను సందర్శించారు. పాఠశాల రికార్డులు పరిశీలించారు. పాఠశాలల్లో అందుతున్న సౌకర్యాలు, ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బైజూస్ యాప్ ద్వారా తమ సామర్థ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. ఉపాధ్యాయుల పాఠ్య ప్రణాళికలు పరిశీలించి తగు సూచనలు చేశారు. వగళ్ల కేజీబీవీలో విద్యార్థినులకు అందుతున్న భోజన వసతి, వైద్య ఆరోగ్య సేవలు గూర్చి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పాఠశాలలో సరైన రక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రెడ్డిబాషా, కేజీబీవీ ప్రిన్సిపాల్ శ్రావణి పాల్గొన్నారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం

పీలేరు : వాహనంతో సహా రూ. 18 లక్షల విలువైన ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్‌ఆర్‌వో వెంకటరమణ తెలిపారు. వివరాలిలావున్నాయి. తిరుపతి - బెంగుళూరు హైవే మార్గంలో ఎర్రచందనం తరలిస్తున్నారన్న సమాచారంతో అటవీ సిబ్బంది రంగంపేట క్రాస్ వద్ద నిఘా ఉంచారు. మంగళవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా తిరుపతి వైపు నుంచి వచ్చిన రెనాల్ట్ డస్టర్ వాహనాన్ని సిబ్బంది ఆపేందుకు ప్రయత్నించారు. అయితే డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా ముందుకు పోవడంతో ఫారెస్ట్ సిబ్బంది వెంబడించారు. డ్రైవర్ వాహనాన్ని రోడ్డుపక్కన ఆపి పరారయ్యాడు. వాహనాన్ని చుట్టిముట్టిన సిబ్బంది వాహనాన్ని పరిశీలించగా ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించారు. పట్టుబడ్డ వాహనం, 313 కేజీల బరువుగల 10 ఎర్రచందనం దుంగల విలువ సుమారు రూ. 18 లక్షలు ఉంటుందని ఎఫ్‌ఆర్‌వో తెలిపారు.

16 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

తిరుపతి అలిపిరి : టాస్క్‌ఫోర్స్ బృందాలు చేపట్టిన సోదాల్లో అన్నమయ్య జిల్లా బాలపల్లి రేంజ్‌లో 16ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకొని నలుగురు స్మగ్లర్లను అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం తిరుపతి టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఆర్‌ఐ కృపానంద బృందం బాలపల్లి రేంజ్ తునికొండ అడవుల్లో కూంబింగ్ చేపట్టారన్నారు. ఇన్నోవా వాహనంలో ఎర్రచందనం లోడ్ చేస్తుండగా గుర్తించి నలుగురిని అరెస్ట్‌చేసినట్లు చెప్పారు.

రోడ్డుప్రమాదంలో వీఆర్వో దంపతులకు గాయాలు

మదనపల్లె : రోడ్డుప్రమాదంలో వీఆర్వో దంపతులు తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం పీటీఎం మండలంలో జరిగింది. మండలంలోని పట్టెంవాండ్లపల్లె వీఆర్వోగా పనిచేస్తున్న చిన్నపరెడ్డి(43) విధులు ముగించుకుని ద్విచక్రవాహనంలో బయలుదేరి మద్దినాయునిపల్లె సచివాలయ ఏఎన్‌ఎంగా పనిచేస్తున్న తన భార్య డి.లలితమ్మ(45)ను వెంటపెట్టుకుని బురకాయలకోట పంచాయతీ ఎర్రగుడివారిపల్లెకు వస్తుండగా మార్గమధ్యంలో ప్రైవేట్ కళాశాల బస్సు వేగంగా ఢీకొంది. ప్రమాదంలో వీఆర్వో చిన్నపరెడ్డి, భార్య లలితమ్మ తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. స్థానిక వైద్యులు చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం వారిని తిరుపతికి రెఫర్ చేశారు. పీటీఎం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులు

గాలివీడు: మిస్సింగ్ కేసును 24 గంటలలో ఛేదించి బాలికను తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్‌ఐ వెంకట శివ కుమార్ తెలిపారు. మండలంలోని గోరాన్ చెరువు గ్రామానికి చెందిన బాలిక సోమవారం ఇంటి నుంచి తల్లిదండ్రులకు చెప్పకుండా వెళ్ళిపోయింది. పెద్దపల్లి స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న ఆ బాలిక చదువుపై ఇష్టం లేక ఇంటినుంచి వెళ్ళిపోయిందన్నారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసును ఛేదించి ఆ బాలికను తల్లిదండ్రులకు అప్పగించామని ఎస్‌ఐ తెలిపారు.

క్రికెట్‌లో రాణిస్తున్న నందలూరు క్రీడాకారులు



క్రికెట్ సబ్‌సెంటర్‌ను సందర్శించిన ఖాజా మోహిద్దీన్, ఐపీఎల్ క్రీడాకారుడు విజయ్

నందలూరు(రాజంపేట) : జిల్లాలో నందలూరు సబ్‌సెంటర్ నుంచి క్రీడాకారులు రాణిస్తున్నారని క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్సార్ డిస్ట్రిక్ జిల్లా కో-ఆర్డినేటర్ ఖాజామోహిద్దీన్ అన్నారు. మంగళవారం సాయంత్రం నందలూరు క్రికెట్ సబ్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందలూరు సబ్‌సెంటర్ నుంచి యువతీయువకులు క్రికెట్‌లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించారన్నారు. హరిప్రియ జోన్‌కు, దివ్యశ్రీ స్టేట్‌కు ఆడారన్నారు. 11 మంది క్రికెటర్స్ నందలూరు నుంచి రాష్ట్రస్థాయిలో ఆడినట్లు వివరించారు. నందలూరుకు చెందిన ఆదిల్‌హుసేన్ అండర్-19 క్రికెట్‌లో ఆల్‌రౌండర్‌గా రాణిస్తున్నారన్నారు. ఇప్పుడు క్రికెట్‌లో నందలూరు నుంచి ఆణిముత్యాలు వస్తున్నాయన్నారు. అందుకే నందలూరు సబ్‌సెంటర్‌కు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. రంజీ క్రీడాకారుడు, ఐపీఎల్ క్రీడాకారుడు విజయ్ మాట్లాడుతూ త్వరలో ఉమెన్స్‌కు క్రికెట్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఉమెన్ క్రికెట్ ఇన్‌చార్జి విష్ణు, సీఏవైడీ అపెక్స్‌మెంబర్ దౌలా, ఏసీఏ వీడియో అనలిస్ట్ రెహ్మాన్, సబ్‌సెంటర్ కోచ్‌లు ఫైరోజ్‌ఖాన్‌లోడి, గాయాజ్, ట్రైనర్ శివకోటి, క్యూరేటర్ హరి తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ జరపాలి

ప్రజాసంఘాల ఐక్యవేదిక డిమాండ్



మృతురాలు అఖిల స్వగ్రామంలో బంధువులను విచారిస్తున్న ప్రజాసంఘాల ఐక్యవేదిక నేతలు

రాయచోటి అర్బన్ : ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటిలో ఇంజనీరింగ్ ఫైనల్‌ఇయర్ చదువుతున్న మంగిర అఖిల (21) అనే విద్యార్థి మృతిపై అనేక అనుమానాలున్నాయని, ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరపాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక నేతలు డిమాండ్ చేశారు. అఖిల ఇడుపులపాయలో చదువుతూ సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందడంతో తాము మృతురాలి స్వగ్రామమైన రాయచోటి మండలం బోగ్యంపల్లెను సందర్శించి మృతదేహాన్ని పరిశీలించి, తల్లిదండ్రులను, గ్రామస్తులను విచారించినట్లు ప్రజా సంఘాల నేతలు తెలిపారు. విద్యార్థిని మృతిపై ఎలాంటి విచారణ జరపకుండానే ప్రేమ వ్యవహారం విఫలం కావడం వలనే అఖిల ఆత్మహత్య చేసుకున్నట్లు ట్రిపుల్ ఐటి యాజమాన్యం ప్రకటించడం సరైనది కాదన్నారు. ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఆనవాళ్లు శిరీష మృత దేహంపై లేవన్నారు. పైగా ఎవరో తాడుబిగించినట్లుగా మెడకు ఉన్న గాయం ఆకారం ఉందన్నారు. ఉన్నతాధికారులు ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలంటూ వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఓపీడీఆర్ నేత ఈశ్వర్, ఎంఎస్‌పీనేత రామాంజనేయులు, ఏఐఎస్‌ఎఫ్ కోటేశ్వరరావు, బానాస నేత తాతయ్య, రజక సంఘం నేత శ్రీనివాసులు, రాజా, వెంకటేష్, వడ్డెర విద్యావంతుల వేదిక నేతలు మారుతి, చల్లా రెడ్డెయ్య, శ్రీరాములు, స్వర్ణకారుల సంఘం నేత అక్బర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

నమో వీరభద్రాయ..

నేటి నుంచి శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు



రాయచోటిలోని శ్రీ వీరభద్రస్వామి ఆలయం

రాయచోటిటౌన్ : దక్షిణ కాశీగా వెలుగొందుతున్న ప్రముఖ పుణ్యక్షేత్రం రాయచోటిలోని వీరభద్రాలయం. ఈ ఆలయ బ్రహ్మోత్సవాలు ఈ నెల 15వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల నిర్వహణకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. బ్రహ్మోత్సవాలకు రాష్ట్రం నలు మూలల నుంచి తరలి వచ్చే భక్తులతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు తరలి వస్తారు. ముఖ్యంగా కర్నాటక రాష్ట్రం నుంచి వీరశైవ భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తారు. కన్నడ భక్తులు బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించడానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తారు.

ఉత్సవ వివరాలు..

- 15వ తేదీ మొదటి రోజు యాగశాల ప్రవేశంతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరుగుతుంది.
- 16వ తేదీ స్వామివారి కళ్యాణోత్సవం నిర్వహిస్తారు. సాయంత్రం సుమంగళి పూజ నిర్వహిస్తారు. రాత్రి శ్రీ భద్రకాళి సమేతుడు గజవాహనంపై దర్శనమిస్తారు.
- 17వ తేదీ రాత్రి సింహవాహన సేవ. 18న మృగవాహనం , రాత్రి మయూర వాహన సేవ. రాత్రి 12 గంటల తరువాత లింగోద్భవ అభిషేకాలు నిర్వహిస్తారు.
- 19న పులి వాహన సేవ. రాత్రి పూలంగి సేవ నిర్వహిస్తారు. అలాగే చంద్రప్రభ వాహనంపై ఊరేగింపు నిర్వహిస్తారు.
- 20న ఉదయం దుర్గా హోమం, చండీ హోమం, శేషవాహనోత్సవం నిర్వహిస్తారు. రాత్రి రావణ వాహనం నిర్వహిస్తారు.
- 21న ఉదయం సూర్యప్రభ ఉత్సవం, రాత్రి నందివాహనోత్సవం. 22న తెల్లవారు జామున అగ్నిగుండ ప్రవేశం, రుద్రహోమం, 11-45 గంటలకు మహానైవేద్యం, సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తారు.
- 23న మహాపూర్ణాహుతి, ధ్వజావరోహణం, కంకణ విసర్జన, వసంతోత్సవం నిర్వహిస్తారు.
- 24న ఉదయం శ్రీ మహా సరస్వతి పూజ, సాయంత్రం అశ్వవాహనోత్సవం నిర్వహిస్తారు.
- 25న రాత్రి ఉయ్యాల సేవ, డోలోత్సవం, ఏకాంత సేవ నిర్వహిస్తారు.

అన్ని ఏర్పాట్లు సిద్ధం..

బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ అధ్యక్షురాలు పోలం రెడ్డి విజయ, ఆలయ ఈవో డీవీ రమణారెడ్డిలు తెలిపారు. పాత రాయచోటి అగస్త్యేశ్వర స్వామి వారి ఆలయ సమీపంలో వాహనాల పార్కింగ్ కోసం స్థలాన్ని ఏర్పా టు చేశామన్నారు. బంగ్లా దగ్గర ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో కూడా వాహనాల పార్కింగ్ కోసం స్థలాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.